

గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు

రాజంపేటలోని బలిజపల్లెలో జరిగే గంగమ్మ జాతరకు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ చైతన్య తెలిపారు. -8లో..



‘స్టాఫ్ నర్స్’ల నియామకానికి వేళాయె

కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామకాలు జరగనున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1200	రూ.1360
రెండోరకం	రూ.980	రూ.1180

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 511 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మామిడి మొక్కల పరిశీలన



నల్లగుట్టపల్లెలో మామిడి మొక్కలను పరిశీలిస్తున్న మద్దిలేటి

రామాపురం: మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయితీ పరిధిలోని ఉపాధి హామీ ద్వారా నాటిన మామిడి మొక్కలను మంగళవారం అన్నమయ్య జిల్లా ఉపాధి హామీ పీడీ మద్దిలేటి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 102 మంది రైతులు 262 ఎకరాల్లో మామిడి మొక్కలను నాటుతున్నారన్నారు. ఇప్పటివరకు 30 ఎకరాల్లో రైతులు మామిడి మొక్కలు నాటారన్నారు. మామిడి మొక్కలు నాటడానికి ఉపాధి కూలీల ద్వారా గుంతలు ఏర్పాటు చేయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈసీ శ్రీకాంత్‌రెడ్డి, టీఏ బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రాణా ప్రతాప్, రఘునాథ్, రైతులు , తదితరులు పాల్గొన్నారు.

నేడు మదనపల్లెలో రాయితీపై బియ్యం, కందిపప్పు

రాయచోటి: మదనపల్లె రైతు బజారులో ఈనెల 19వ తేదీన ప్రత్యేక కేంద్రం ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పులను రాయితీ ధరపై ప్రజలకు అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన పత్రికలకు ప్రకటనను జారీ చేశారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు ధరలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు సాధారణ ప్రజలకు తక్కువ ధరకే రాయితీపై బియ్యం, కందిపప్పు అందజేసేలా ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లె రైస్ మిల్లర్లు, పప్పు వ్యాపారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఫైన్ వెరైటీ బీపీటీ బియ్యం, ప్రస్తుత మార్కెట్ ధర రూ. 56 కాగా, రైతు బజార్‌లో రాయితీపై రూ. 48లకు, స్టీమ్ రైస్ ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 53 కాగా, రాయితీపై రూ. 46కు, కందిపప్పు దేశవాళీ రూ. 138లకు అందజేయడం జరుగుతుందన్నారు.ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ ఆ ప్రకటనలో కోరారు.

రైతులకు బిల్లులు ఇవ్వాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

గుర్రంకొండ: ఎరువుల దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసే రైతులకు ఎరువుల దుకాణాల యజమానులు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ అన్నారు. మంగళవారం గుర్రంకొండ పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లో లైసెన్స్‌లు, స్టాకు,పంపిణీ రిజిస్టర్లు పరిశీలించారు. దుకాణాలు, గోడౌన్లలో ఉన్న ఎరువుల శాంపిల్స్‌ను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణంలో టాక్స్, ఇన్వాయిస్ కచ్చితంగా ఉండాలన్నారు. దుకాణాల నిర్వహణకు సంబంధించి లైసెన్స్‌లు లిగి ఉండాలన్నారు. స్టాకుబోర్డు, ధరల సూచిక బోర్డులు దుకాణాల వద్ద ఉంచాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో రత్నమ్మ, ఎంపీఈవోలు మహేష్‌నాయక్, నవాజ్‌లు పాల్గొన్నారు.

22న ప్రత్యేక లోక్ అదాలత్



మాట్లాడుతున్న అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఉద యం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్‌లు తెలిపారు. మంగళవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఇతర వివరాలకు 08562-258622, 244622 నంబర్లలో సంప్రదించాలన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి, ఎంఈఓపీ పిటీషనర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

చుక్కలు.. వీడుతున్న చిక్కులు

దశాబ్దాల నాటి చుక్కల భూముల చిక్కుముడులు వీడుతున్నాయి. నిషేధిత జాబితా నుంచి తొలగించి ఆ భూములపై రైతులకు సర్వ హక్కులు ప్రభుత్వం కల్పిస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఇప్పటికే పలుచోట్ల రెవెన్యూ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు హక్కుపత్రాలు అందజేశారు. దీంతో క్రయ-విక్రయాలు, రిజిస్ట్రేషన్లు జోరందుకున్నాయి. చుక్కల భూములపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారంటూ టీడీపీ మినహా అన్ని పక్షాలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నాయి. ఏనాడూ సత్యం రాయని 'ఈనాడు' మాత్రం ఈనెల 15న ‘చుక్కలు చూపిస్తున్నారు’ శీర్షికన బురద జల్లే యత్నాలకు పాల్పడింది.



వైఎస్ఆర్ జిల్లా చాపాడు మండలం కేతవరం గ్రామ సమీపంలోని చుక్కల భూమి

- 19,063 ఎకరాలకు విముక్తి
- 12,181 మంది రైతులకు లబ్ధి
- సీఎం చరిత్రాత్మక నిర్ణయంపై సర్వత్రా హర్షం

కడప సెవెన్‌రోడ్స్: బ్రిటీషు కాలంలో జరిగిన రీ సర్వేలో భూమి శిస్తుకు భయపడిన రైతులు ఫలానా భూమి తాను సాగు చేసుకుంటున్నానని అధికారులకు చెప్పలేదు. దీంతో ఆర్ఎస్ఆర్‌లో చుక్కలు పెట్టారు. ఇన్నాళ్లు వాటిని ప్రభుత్వ భూములుగా పరిగణిస్తూ వచ్చారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో రైతుల పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్లయింది. పిల్లల చదువులు, వివాహాలు, వైద్య ఖర్చులు వంటి అత్యవసరాలకు ఆ భూములను అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర సందర్భంగా ఈ సమస్య ఆయన దృష్టికి వచ్చింది. ఇటీవల చుక్కల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు సంపూర్ణ హక్కును కల్పిస్తూ ముఖ్యమంత్రి చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. సీఎం నిర్ణయం పట్ల రైతులే కాకుండా వామపక్ష రైతు సంఘాలు సైతం హర్షం వ్యక్తం చేశాయి.

ఆధారాలు చూపాలి

చుక్కల భూములను తాము సాగు చేసుకుంటున్నట్లు రైతులు తగిన ఆధారాలు రెవెన్యూ అధికారులకు చూపాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన అడంగల్, రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్ (ఆర్‌హెచ్ నకలు), ఆర్ఎస్ఆర్ నకలు చూపాలి. అలాగే కోర్టు వాజ్యాలు, అన్నదమ్ముల మధ్య భాగపరిష్కార విషయంలో వివాదాలు లేవని చూపించాలి. ఒకవేళ ఆ భూమి ఇతరుల నుంచి కొనుగోలు చేసి ఉంటే అందుకు సంబంధించిన దస్తావేజులు సమర్పించాలి. తాము సాగు చేసుకుంటున్న భూమి అసైన్ చేసింది కాదని చూపాలి. ఎందుకంటే గతంలో చుక్కల భూములకు డీకేటీ పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్స్ మంజూరు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం డీకేటీ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించడం కుదరదు. ఈ ఆధారాలన్నీ రెవెన్యూ అధికారులు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే ఆ భూములను రిజిస్ట్రేషన్ యాక్టు 22ఏ జాబితా నుంచి తొలగించాలని, రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని తహసీల్దార్లు సబ్ రిజిస్ట్రార్లకు నివేదికలు పంపుతారు. అప్పుడు రైతులు ఆ భూములపై సర్వహక్కులు ఏర్పడుతాయి. రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంటుంది.

19,063 ఎకరాలకు విముక్తి

వైఎస్సార్ జిల్లాలో చుక్కల భూములకు సంబంధించి 38,240 సర్వే నంబర్లు ఉన్నాయి. ఇందులో 52,186.20 ఎకరాల చుక్కల భూములు ఉన్నాయి. ప్రభుత్వం వీటిని 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశాక ఇప్పటివరకు 11,862 సర్వే నెంబర్లలోని 19,063 ఎకరాల భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి కలిగింది. ఇందువల్ల 12,181 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం 20 సంవత్సరాలు అనుభవం ఉన్న డీకేటీ భూములకు కూడా రిజిస్ట్రేషన్ సౌలభ్యాన్ని కల్పిస్తూ తీర్మానం చేసింది. ఇందుకు సంబంధించి జీఓ, విధి విధానాలు వెలువడాల్సి ఉంది. డీకేటీ భూముల రిజిస్ట్రేషన్లు కూడా ప్రారంభమైతే చుక్కలభూములకు గతంలో ఇచ్చిన డీకేటీ పట్టా భూములకు కూడా క్రయ విక్రయాలకు అవకాశం కలుగుతుంది.

రైతులకు ఎంతో ఉపశమనం



చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు ఎంతో ఉపశమనం కలిగిస్తోంది. జమ్మలమడుగు మండలంలో చుక్కల భూములకు సంబంధించిన 1500 సర్వే నెంబర్లు తిరిగి నిషేధిత జాబితాలో చేర్చారనడంలో నిజం లేదు. ఆ 1500 సర్వే నెంబర్లు వాగులు, వంకలు, రస్తాలు, కొండలు, ఇతర ప్రభుత్వ పోరంబోకు భూములకు సంబంధించినవి. అందుకే అవి రిజిస్ట్రేషన్ జరగకుండా నిషేధిత జాబితాలో ఉంచాము. అంతే తప్ప ఆ సర్వే నంబర్లు చుక్కల భూములకు సంబంధించినవి కావు. - శ్రీనివాసులు, ఆర్డీఓ, జమ్మలమడుగు

వేగంగా లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ అవార్డ్స్

- అధికారులకు జిల్లా కలెక్టర్ గిరీషా ఆదేశం

రాయచోటి : జిల్లాలోని ముదివేడు, శ్రీనివాసపురం రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్, గాలివీడు మండలంలోని సోలార్ పార్క్ పథకాలకు భూసేకరణ అవార్డ్స్‌ను త్వరగా పూర్తి చేయాలని, సహాయ పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల అంశాలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలు అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను చేపట్టిందన్నారు. ముదివేడు రిజర్వాయర్‌కి సంబంధించి 1075 ఎకరాలు అవసరం కాగా ఇందులో 425 ఎకరాలు భూసేకరణ చేసి అవార్డు పాస్ చేసినట్లు చెప్పారు. అవార్డ్స్ పాస్ చేసిన భూమికి సంబంధించి లబ్ధిదారులకు త్వరగా పరిహారం పంపిణీ పూర్తి చేయాలన్నారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల నుంచి అవార్డ్స్ పాస్ కొరకు రికార్డులను కలెక్టరేట్‌కు పంపాలని ఆదేశించారు.

- శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు సంబంధించి దాదాపు రూ.6.30 కోట్ల మేర పరిహారం పంపిణీ చేయాల్సి ఉందని, ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు.
- గాలివీడు మండలం తూముకుంట, వెలిగల్లులలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పార్కుకు సంబంధించి ఇప్పటి వరకు 1115 ఎకరాలు భూసేకరణ చేయగా ఇంకా 208 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు.
- హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-1 భూసేకరణలో భాగంగా మదనపల్లె, మొలకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లెలో మిగులు భూమి సేకరణను త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే మంగంపేటకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి త్వరగా అవార్డు పాస్ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్డీఓలు రంగస్వామి, మురళి, భాస్కర్, ఎస్డీసీలు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్ అండ్ బీ, హౌసింగ్, విద్యుత్, సర్వే శాఖల అధికారులు, సంబంధిత తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు ‘జగనన్నతోడు’



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

- పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తుల వారికి జగనన్నతోడు పథకం బాసటగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. జగనన్నతోడు 7వ విడతలో భాగంగా చిరు వ్యాపారులు వడ్డీలేని రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా, రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, గ్రామ వార్డు సచివాలయ జిల్లా అధికారి మనోహర్ రాజు, ఎల్‌డీఎం లబ్ధిదారులు పాల్గొన్నారు. జగనన్నతోడు పథకం 7వ విడత జిల్లాలో మొత్తం 17,146 మందికి రూ. 1846.5 లక్షలు జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పథకం ద్వారా రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 14648 మందికి రూ. 30.345 లక్షల వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద లబ్ధిదారులకు జమ చేశామన్నారు. వీధి వ్యాపారులకు బాసటగా నిలుస్తున్న జగనన్న తోడు పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు . చిరు వ్యాపారులకు రూ.10 వేలు వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో మహిళల ముఖ్యంలో చిరునవ్వులు కనిపిస్తున్నాయని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు.

చాలా సంతోషంగా ఉంది.



నా పేరు సి సంధ్య. రాయచోటి ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నాను. అమ్మ బిస్కెట్లు తయారు చేస్తుంది. ఇంటిలోనే పని చేసుకోవడం వల్ల పెట్టుబడి పోను రూ.10 వేలు ఆదాయం వస్తుంది. అమ్మఒడి, సున్నావడ్డీ పథకాల ద్వారా లబ్ధి పొందాను.ఈ రోజు రూ. 10 వేలు నా ఖాతాలో ముఖ్యమంత్రి జమ చేశారు. చాలా సంతోషంగా ఉంది. - సి. సంధ్య, ఇందిరమ్మ కాలనీ, రాయచోటి, అన్నమయ్య జిల్లా

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది



నాపేరు ఎం కళ్యాణి. ఎండపల్లిలో ఉంటున్నాను. టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాను. గత సంవత్సరంలో జగనన్నతోడు పథకం ద్వారా బ్యాంకులో రూ. 10 వేలు రుణం తీసుకున్నాను. సకాలంలో డబ్బులు చెల్లించినందుకు నేను తీసుకున్న రుణానికి జగనన్న వడ్డీ జమ చేశారు. ఈ మొత్తంతో టైలరింగ్ మిషన్ కొనుగోలు చేశాను. రాష్ట్రంలో అన్ని వర్గాల వారి సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. -కళ్యాణి, ఎండపల్లి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

జగనన్న సురక్ష.. సామాన్యులకు రక్ష

- ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు పొందుతున్న జనం
- అడిగిన వెంటనే ధృవీకరణ పత్రాలు ఇస్తున్న వైనం
- ఇప్పటివరకు 1,43,679 పైగా సేవలు పొందిన ప్రజలు



కురబలకోట మండలం చింతమాకులపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందజేత

సాక్షి రాయచోటి : పింఛన్ కావాలనో...'చేయూత'ఇవ్వాలనో..'భరోసా'కల్పించాలనో.. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు...అర్జీలు ఇవ్వాల్సిన పని కూడా తప్పింది.. ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి సమస్య తెలుసుకుంటున్నారు. దరఖాస్తు పూర్తి చేసి, సచివాలయాల్లో అందజేసి, ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటే లబ్ధిదారుగా చేరుస్తున్నారు. అంతేకాకుండా పైసా ఖర్చు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు వేగంగా, సౌకర్యవంతంగా ఉచితంగా సేవలు అందించాలన్న సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి అన్నమయ్య జిల్లాలో విశేష స్పందన లభిస్తోంది. కుల ధృవీకరణ పత్రం అందుకున్న విద్యార్థి.. రేషన్ కార్డు తీసుకున్న ఇంటి పెద్ద.. ఇల్లు మంజూరు పత్రాన్ని పొందిన మహిళ.. పంట నష్ట పరిహారానికి అర్హత సాధించిన రైతు.. వాహన మిత్ర పథకంలో లబ్ధిదారునిగా చేరిన డ్రైవరు.. ఇలా ఒకరేమిటి.. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ సేవలు ఉచితంగా అందడంతో హర్షం వ్యక్తం చేశారు.

ఎక్కడికి వెళ్లకుండా...సిఫార్సులు లేకుండా!

ఎక్కడికీ వెళ్లకుండా.. ఎవరి సిఫార్సులు లేకుండా.. పైసా ఖర్చు లేకుండా అవసరమైన పత్రాలు అందించేందుకు, అర్హత ఉండి ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండేవారిని లబ్ధిదారులుకు అన్ని అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. ఎక్కడికక్కడ వలంటీర్లు ఇళ్లకు వెళ్లి సచివాలయ పరిధిలో దరఖాస్తులకు పరిష్కారం చూపుతున్నారు.

అందిన సేవలు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 399 సచివాలయాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించారు. మొత్తం 1,43,679 మందికి వివిధ సేవలను అందజేశారు. ఎక్కడికక్కడ అడిగిన వారికి, అడగని వారికి కూడా అవసరాన్ని బట్టి సేవలు అందిస్తున్నారు. లబ్ధిదారులకు సర్వీసు చార్జీలు లేకుండానే ఆదాయ, పుట్టిన, మరణ, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధృవీకరణ పత్రాలు), మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ), వివాహ ధ్రువీకరణ పత్రం (పట్టణ ప్రాంతాల్లో అయితే 90 రోజుల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 60 రోజుల్లోపు), ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు సేవలు వలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ అందిస్తున్నారు.

91 శాతం సమస్యల పరిష్కారం

జిల్లాలో వివిధ సంక్షేమ పథకాలకు తమను అర్హులు చేయాలని, ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్, ఇంకమ్, బర్త్, డెత్, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్, మ్యూటేషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సీసీఆర్ కార్డు ఇవ్వాలని వలంటీర్ల సర్వేలో 2,46,899 మంది కోరారు. ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను పరిశీలించిన వలంటీర్లు, ఇతర అధికారులు 1,57,190 మందికి సేవలు అందించాలని టోకెన్లను జారీ చేశారు. మిగిలిన సర్టిఫికెట్లపై విచారణ జరుగుతోంది. విన్నపాల్లో 91 శాతం పరిష్కారం కాగా మిగతా జిల్లాలతో పాటు అన్నమయ్య జిల్లాకూడా పోటీ పడుతోంది.

ఉచితంగా సర్టిఫికెట్ అందింది



నా పేరు చింతమాని దివ్యశ్రీ, టి సుండుపల్లె మండలం, ఎగువ ఈడిగపల్లె, అన్నమయ్య జిల్లా. చేయూత పథకం కోసం క్యాస్ట్ కావాల్సి ఉంది. వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి అన్ని వివరాలు తీసుకుని, నాతో దరఖాస్తు పూరించి సచివాలయంలో ఇచ్చారు. అధికారుల పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం రావడంతో నాకు అందజేశారు. ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు అందడం చాలా సంతోషంగా ఉంది.

అర్హులందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన 'జగనన్న సురక్ష'కార్యక్రమం ద్వారా పౌరసేవలన్నీ వేగంగా అందిస్తున్నాం. శాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం మంచి చేస్తోంది. అర్హులై ఉండి ఏ కారణంతోనైనా ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ఈ 'జగనన్న సురక్ష'ద్వారా ఇంటింటినీ జల్లెడ పట్టుతున్నాం. నియోజవర్గ, మండల స్పెషల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. – గిరీషా పీఎస్, జిల్లా కలెక్టర్

యువత బలోపేతంతోనే భావిభారత నిర్మాణం

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాయచోటి అర్బన్ : యువతరం బలోపేతం అయినప్పుడే భావిభారత నిర్మాణం జరుగుతుందని పారిశ్రామికంగా, సాంకేతికంగా, ఆర్థికంగా, యువత ఆలోచనలు దేశాభివృద్ధికి దోహదపడతాయని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి అన్నారు. స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు,క్రీడాశాఖ, అన్నమయ్య జిల్లా నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ -2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జాతీయ,రాష్ట్రస్థాయి పోటీలను యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అన్నమయ్య జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి కె. మణికంఠ మాట్లాడుతూ భారతదేశం కళలకు పుట్టినిల్లు అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న యువజన క్రీడోత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని ప్రతిభ కనపరచాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని అన్నారు. వీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, నైతికవిలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. సాయి విద్యాసంస్థల ఏడీ సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరించిన విద్యార్థులకు జెడ్పీ చైర్మన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.కార్యక్ర మంలో రాజంపేట స్పెషల్ జ్యుడీ షియల్ రెండోకోర్టు మెజిస్ట్రేట్ పసుపులేటి శివశంకర్, వీఆర్‌డీఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, యువజన సర్వీసులశాఖ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

ANNAMACHARYA
INSTITUTE OF TECHNOLOGY AND SCIENCES-KADAPA
(Approved by AICTE, Affiliated to JNTUA & NAAC with 'A' Grade)
Utukur (P), C.K. Dinne (V & M), Kadapa Y.S.R. Dist.,-516003

Now AUTONOMOUS

COURSES OFFERED :

B.Tech
- Civil Engineering
- Electrical & Electronics Engg.
- Mehcanical Engineering
- Electronics & Communication Engg.
- Computer Science & Engineering
- Artificial Intelligence & Data Science
- CSE (Artificial Intelligence & Machine Learning)

M.Tech
- Structural Engineering
- Electrical Power System
- Thermal Engineering
- VLSI System Design
- Computer Science & Engineering

Introducing New Courses from 2023-24

Diploma
- Electrical & Electronics Engg.
- Electronics and Communication Engineering
- Computer Science & Engineering

- MCA
- MBA

Counseling Code : AITK

for Admissions Contact : 9603999591, 7386324079

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలో మండలంలోని నీలకంట్రావుపేట పంచాయతీ శివాలయం సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి వైపు నుంచి కడప వైపు నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడు మార్గంమధ్యలో నీలకంట్రావుపేట పంచాయతీ శివాలయం సమీపానికి రాగానే వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భిక్షాటన చేసుకుంటూ జీవించేవాడు. వయసు 60 ఏళ్లు ఉండవచ్చు. సంఘటన స్థలానికి ఎస్ఐ కొండారెడ్డి తన సిబ్బందితో చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. కొత్తిండ్లు రామిరెడ్డికాలనీకి చెందిన భాను భార్య పి.శిల్ప (35) కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

– ముగ్గురు కొనుగోలుదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఇన్‌చార్జి సీఐ నరసింహారావు

రైల్వేకోడూరు : పట్టణంలోని చిట్వేలి రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న ఒక మహిళను, అలాగే కొనుగోలు చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి సీఐ నరసింహారావు వివరాలు వెల్లడించారు. ఎస్ఐలు మోహన్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లు, తహసీల్దారు రామ్మోహన్‌తో కలిసి చిట్వేలి రోడ్డు గ్రామ పంచాయతీ కాలనీ క్రాస్ రోడ్డు వద్ద దాడులు నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న పలిగిలి లక్ష్మిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. అలాగే ఆమె వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్న కోనేరు గుణదీప్, వెలిగండ్ల శ్యాంసుందర్, కొండేటి కిశోర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 1020 గ్రాముల గంజాయి, ఒక ఆటో, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీన పరుచుకొన్నట్టు తెలియజేశారు. నలుగురిని కోర్టులో హాజరుపెట్టినట్టు తెలిపారు. త్వరలోనే మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టనున్నట్టు వివరించారు. సమావేశంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేద.. ఆపై పెద్ద బాధ

- ఇద్దరు కుమార్తెలకు వ్యాధులు
- ఒకరికి నరాలు, మరొకరికి కిడ్నీ జబ్బులు
- చికిత్స చేయించలేక సతమతమవుతున్న తండ్రి
- దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి

మైదుకూరు : రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం వారిది. ఆపై పెద్ద బాధ వచ్చి పడింది. వారికి నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబ పోషణకు భార్యభర్తలిద్దరూ కూలీ పనికి పోవాల్సిందే. 'అందరూ ఆరోగ్యంగా ఉంటే కష్టించి పిల్లల్ని పోషించేందుకు వెనుకాడను... కానీ నలుగురు ఆడ పిల్లల్లో ఇద్దరిపై విధి చిన్న చూపు చూసింది. పేద కుటుంబంపై పెను భారం మోపింది. కూలీ పనులకు వెళ్లి సంపాదించింది.. చికిత్సకు లొంగని జబ్బులతో ఉన్న ఆ ఇద్దరాడపిల్లలను డాక్టర్ల వద్దకు తిప్పడానికే చాలడం లేదు' అంటూ మైదుకూరు మండలం పప్పనపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ఎర్రబల్లె వెంకటయ్య అనే పేద తండ్రి ఆవేదన చెందుతున్నాడు. పప్పనపల్లె ఎస్సీ కాలనీకి చెందిన వెంకటయ్య, రాణి దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె సంగీత ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. బీఎస్సీ నర్సింగ్ చేయాలనుకుంటోంది. రెండో కుమార్తె 11 ఏళ్ల సాగరిక. మూడు కుమార్తె ఏడేళ్ల లక్ష్మీప్రసన్న, నాలుగో కుమార్తె ఐదేళ్ల స్నేహ. చివరగా కుమారుడు కళ్యాణ్ కుమార్, ఇతని వయసు మూడేళ్లు. వీరిలో సాగరిక నరాల వ్యాధితో బాధపడుతోంది. అవయవాల పెరుగుదల సరిగా లేదు. ఈ అమ్మాయి చికిత్స కోసం కడప, కర్నూలు, నెల్లూరు, హైదరాబాద్‌లోని ఆస్పత్రులు తిరిగాడు వెంకటయ్య. అయినా ఫలితం లేకపోయింది. మూడో కుమార్తె లక్ష్మీప్రసన్నకు కిడ్నీ వ్యాధి సోకింది. కిడ్నీల్లో ఇన్‌ఫెక్షన్ వల్ల మూడు నెలలకోసారి ముఖం, ఉదరంలో వాపు వస్తుంది. కడుపులో నీరు చేరి, సాధారణంగా 18 కిలోలుండే అమ్మాయి 25 కిలోలకు బరువు పెరుగుతుంది. ఈ అమ్మాయి చికిత్స కోసం వెంకటయ్య దంపతులు కడప, తిరుపతిలోని ఆస్పత్రుల్లో చూపిస్తున్నారు.

అప్పు చేసి చూపిస్తున్నా.. నయం కాని వైనం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెల రోజుల వరకు ఉంచుకుంటూ తిప్పి పంపుతున్నారని, అందువల్ల అప్పు చేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపిస్తున్నానని, అయితే నయం కావడం లేదని వెంకటయ్య వాపోతున్నాడు. కూలి పనికి పోతేనే ఇల్లు గడుస్తుందని, అలాంటిది ఆస్పత్రికి వెళ్లినప్పుడల్లా రూ.20 వేలు ఖర్చు అవుతూ, తలకు మించిన భారం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంటిలో ఇద్దరు పిల్లల పరిస్థితి ఈ విధంగా ఉన్నందున వారిని చూసుకునేందుకు భార్యభర్తల్లో ఒకరం ఇంటి వద్ద ఉండాల్సి వస్తోందని చెప్పాడు. నరాల జబ్బుతో ఉన్న రెండో కుమార్తె గురించి ఆందోళన పడటం మానేశామని, ఇప్పుడు తమ దిగులంతా మూడో కూతురు గురించేనని తండ్రి వెంకటయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ అమ్మాయికి కిడ్నీల్లో ఇన్‌ఫెక్షన్ కనీసం 13 ఏళ్ల వచ్చే వరకు ఉంటుందని తిరుపతిలోని వైద్యులు అంటున్నారని, హైదరాబాద్‌లో చికిత్స చేయించడం మంచిదంటున్నారని చెప్పాడు. హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించే తాహతులేక జీవితంపై విరక్తి కలుగుతోందని వెంకటయ్య ఆవేదనగా చెప్పాడు. దాతలు ఆదుకుంటే తన కుమార్తెకు మెరుగైన చికిత్స చేయించుకుంటానని ఆయన అభ్యర్థిస్తున్నాడు. వెంకటయ్యకు ఆర్థిక సహాయం అందించేవారు వనిపెంటలోని భారతీయ స్టేట్ బ్యాంకులో ఉన్న వెంకటయ్య అకౌంట్ 33026293447కు సాయం పంపాలని కోరుతున్నాడు.



నరాల, కిడ్నీ వ్యాధులతో ఉన్న కుమార్తెలతో వెంకటయ్య

'స్టాఫ్ నర్స్'ల నియామకానికి వేళాయె

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత అనే సమస్యే లేకుండా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్టాఫ్‌నర్స్‌ల నియామకాలను పెద్ద ఎత్తున చేపడుతోంది. ఫలితంగా అర్హులైన నిరుద్యోగులు ఉద్యోగులుగా మారుతున్నారు.

- 313 పోస్టుల భర్తీకి చర్యలు
- ఈ నెల 21, 22న కౌన్సెలింగ్



కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామకాలు పెద్ద సంఖ్యలో జరిగాయి. మరో మారు అధిక సంఖ్యలో జరగనున్నాయి.

మొత్తం 11,120 దరఖాస్తులు

ఈ ఏడాది ప్రారంభం నుంచే ప్రభుత్వం పెద్ద సంఖ్యలో స్టాఫ్ నర్స్ నియామకాలను చేపట్టింది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల నుంచి మొత్తం 11,120 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నిబంధనల ప్రకారం జనవరి నుంచి ఏప్రిల్ వరకు మొత్తం 286 మంది అర్హులకు స్టాఫ్ నర్స్‌లుగా నియమించారు. వారంతా తమకు కేటాయించిన స్థానాల్లో విధులను చేపడుతున్నారు.

తాజాగా 313 నియామకాలు

ప్రభుత్వం మరో మారు స్టాఫ్‌నర్స్ నియామకాలను చేపట్టింది. ఇప్పటికే వచ్చిన 11,120 దరఖాస్తుల నుంచి అర్హులైన అభ్యర్థులను రాయలసీమలోని 8 జిల్లాల్లో గల ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 313 నియామకాలను చేపడుతున్నారు. మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) పరిధిలో 90, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆధ్వర్యంలో (నంద్యాల మెడికల్ కాలేజీ, తిరుపతి మెటర్నిటీ ఆసుపత్రి) 149, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌లో 74 మొత్తం 313 నియామకాలను చేపడుతున్నారు. పెద్ద సంఖ్యలో నియామకాలను చేపట్టడం పట్ల అర్హులైన అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 21, 22వ తేదీల్లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలను చేపడుతున్నాం. ఇందుకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తాం. కౌన్సెలింగ్‌ను కట్టుదిట్టంగా చేపడుతాం.

– డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

సరికొత్త మోసం

- ఖాతాదారుల వేలిముద్రలు లేకనే డబ్బు గల్లంతు
- ఫినో, బీసీ సెంటర్ల నుంచి డ్రా అయినట్టు సమాచారం
- మొబైల్ ఫోన్లకు సమాచారంతో ఫిర్యాదులు

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో సరికొత్త బ్యాంకింగ్ మోసం మంగళవారం వెలుగులోకి వచ్చింది. మేనేజర్లకు అందుతున్న ఫిర్యాదులను దర్యాప్తు కోసం ఆయా బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు పంపుతున్నారు. ఫిర్యాదులన్నింటినీ సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులపై ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. ఎప్పుడు ఎవరి ఖాతా నుంచి ఎంత నగదు మాయమై మొబైళ్లకు మేసేజ్ వస్తుందో అన్న భయం పట్టుకుంది.

బ్యాంక్‌లకు ఖాతాదారుల క్యూ

బి.కొత్తకోటలో నాలుగు ప్రధాన బ్యాంకుల బ్రాంచ్‌లు, ఒక సహకార బ్యాంకు, మరికొన్ని ప్రయివేటు బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకుల్లో ఖాతాలున్న వ్యక్తులు సాధారణంగా డబ్బు డ్రా చేయాలంటే బ్యాంకుకు వెళ్లి చలానా రాసిస్తాం, లేదంటే ఏటీఎంలో డ్రా చేసుకుంటాం. ఇవేవి కాదంటే ఫినో బ్యాంకింగ్, బీసీ సెంటర్లకు వెళ్లి అక్కడ పని చేస్తున్న సిబ్బందికి ఆధార్ నంబర్ ఇస్తే అకౌంట్ నుంచి డబ్బు డ్రా చేస్తారు. దీనికి ఖాతాదారుడు వేలిముద్ర వేయడం తప్పనిసరి. అయితే ఈ వేలిముద్రలు లేకుండానే ఖాతాదారుల ఖాతాల్లో డబ్బులు మాయమైపోతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తూ బి.కొత్తకోట పట్టణంలోని వివిధ బ్యాంకులకు చెందిన ఖాతాదారులు ఐదారు రోజులుగా బ్యాంకు మేనేజర్ల వద్దకు క్యూ కడుతున్నారు.

సమగ్ర విచారణకు చర్యలు

కొన్ని రోజులుగా ఫినో బ్యాంకింగ్ లేదా బీసీ సెంటర్ల నుంచి డబ్బు డ్రా అవుతున్నట్టు సుమారు 50 మంది ఖాతాదారులు ఆయా బ్యాంకుల మేనేజర్లకు ఫిర్యాదులు చేశారు. తాము వెళ్లి వేలిముద్రలు వేయలేదని, అయినా కూడా నగదు డ్రా చేసినట్టు మొబైళ్లకు మేసేజ్‌లు వస్తున్నాయని మేనేజర్లకు చూపించారు. తమ ప్రమేయం లేకుండా డ్రా అవుతున్న నగదును ఎవరు డ్రా చేస్తున్నారో తేల్చి న్యాయం చేయాలని ఫిర్యాదులు చేస్తున్నారు. దీనిపై అప్రమత్తమైన మేనేజర్లు డబ్బు డ్రా అవుతున్న ఖాతాల నుంచి మళ్లీ డబ్బు డ్రా చేయకుండా ఫ్రీజ్ చేశారు. ఖాతాల నుంచి డబ్బును ఎవరు మాయం చేస్తున్నారు అనే విషయంపై ఆరా తీసే పనిలో పడ్డారు బ్యాంకు అధికారులు. ఖాతాదారులు ఆధార్‌కార్డును ఎక్కడెక్కడ వినియోగిస్తారు, అక్కడ ఆధార్ నంబర్లు, వేలిముద్రలు ఎవరు తీసుకుంటున్నారు, ఒకసారి తీసుకున్న వేలిముద్రను మళ్లీ ఎలా వినియోగిస్తున్నారు, ఇది ఎప్పటి నుంచి ఏ సెంటర్ల నుంచి సాగుతోంది, మొత్తం ఎంత డబ్బును ఇలా నొక్కేశారు అన్నది సమగ్ర విచారణకు చర్యలు చేపట్టారు. బి.కొత్తకోటతోపాటు మరికొన్ని చోట్ల ఇదే విధంగా మోసాలు జరిగినట్టు బ్యాంకుల అధికారుల దృష్టికి వచ్చింది. దీనిపై స్థానిక ఓ బ్యాంకు మేనేజర్ ‘సాక్షి’తో మాట్లాడుతూ తమ బ్యాంకుకు చెందిన మూడు ఖాతాల నుంచి వేలిముద్రలు లేకుండా డబ్బు డ్రా అయినట్టు ఖాతాదారులు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ ఫిర్యాదులను బ్యాంకు ప్రధాన కార్యాలయానికి పంపామని, దీనిపై సైబర్ క్రైమ్ అధికారులు విచారణ చేట్టనున్నట్టు తెలిపారు.

తండ్రిని కత్తితో పొడిచిన తనయుడు

పోరుమామిళ్ల : పట్టణంలోని బలిజకోట వీధికి చెందిన నంద్యాల రామయ్య(65)ను కుమారుడు లక్ష్మీనరసయ్య కత్తితో పొడిచిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆస్తి తగాదా, కుటుంబ సమస్యలతో కుమారుడు తండ్రిపై దాడి చేశాడని, కత్తితో పొడవటంతో రక్తగాయాలయ్యాయన్నారు. రామయ్యను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. ప్రాణాపాయం లేదన్నారు. లక్ష్మీనరసయ్యపై కేసు నమోదు చేశామని, అతను పరారీలో ఉన్నాడన్నారు.

గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు

రాజంపేట టౌన్ : పట్టణంలోని బలిజపల్లెలో గురువారం జరగనున్న గంగమ్మ జాతరకు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జాతరను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు బలిజపల్లె గ్రామం పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. తనతోపాటు ఇద్దరు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, పలువురు హెడ్‌కానిస్టేబుళ్ళు, 80 మంది పోలీసులు, స్పెషల్ పార్టీ బృందాలు బందోబస్తుగా ఉంటారని తెలిపారు. తమ సిబ్బంది ఎక్కడి వారు అక్కడ అనుక్షణం డేగ కన్ను వేసి ఉంటారన్నారు. ముఖ్యంగా చైన్ స్నాచర్స్, పిక్‌ప్యాకెటర్ల ఆటకట్టించేందుకు కొంత మంది సిబ్బంది మఫ్టీలో ఇటు జాతరలోను అటు పట్టణంలోను తిరుగుతుంటారని పేర్కొన్నారు. జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు నిర్వాహకులతోపాటు భక్తులు కూడా పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, భక్తులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరి వల్ల అయినా సమస్యలు తలెత్తినా భక్తులు తగాదాలు పెట్టుకోకుండా దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియ చేయాలన్నారు. బలిజపల్లెలో అన్ని వైపులా సీసీ కెమెరాలు ఉంటాయని, అందువల్ల జాతర మొత్తం నిఘా నీడలో ఉంటుందని తెలిపారు. ప్రజలంతా ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని వివరించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ చైతన్య

బంగారు నగలు తక్కువగా ధరించాలి

జాతరకు వచ్చే భక్తులు బంగారు నగలను తక్కువగా ధరించి రావాలని డీఎస్పీ చైతన్య కోరారు. భక్తులు పెద్దసంఖ్యలో వస్తారని, అందువల్ల జాతరలోకి ప్రవేశించగానే అప్రమత్తంగా ఉండాలన్నారు. బంగారు చైన్లు వేసుకునే వారు అవి బయటకు కనిపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నగదు కూడా అవసరం మేరకు మాత్రమే తెచ్చుకోవాలని సూచించారు. జాతరలోకి వచ్చినప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరుకునే వరకు పిల్లలను తల్లిదండ్రులు తమ వద్దనే ఉంచుకోవాలన్నారు. పొరపాటున చిన్న పిల్లలు తప్పిపోతే వెంటనే దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియజేయాలన్నారు.

మూడు ప్రాంతాల్లో వెహికల్ పార్కింగ్

వాహనాల్లో వచ్చే భక్తుల కోసం మూడు ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. నూనెవారిపల్లె వైపు నుంచి వచ్చే వారికి రాజుస్కూల్ వెనకవైపు ఉన్న ఖాళీస్థలం, అలాగే రైల్వేస్టేషన్ ప్రాంతం నుంచి గంగిరెడ్డిపాలెంవీధి మీదుగా వచ్చే వారికి బలిజపల్లె టర్నింగ్, మన్నూరువైపు నుంచి వచ్చే భక్తులకు నారపురెడ్డిపల్లె ప్రాంతంలో వెహికల్ పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జాతరలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ వాహనాలను అనుమతించబోమని వివరించారు.

చెన్నరాయునిపల్లిలో ఉద్రిక్తత

- మృతదేహం ఖననం విషయంలో నెలకొన్న వివాదం
- పోలీసులు, రెవెన్యూ చొరవతో తాత్కాలికంగా పరిష్కారం





వివాదాస్పదంగా మారిన స్థలం, ఇరు వర్గీయులతో చర్చిస్తున్న పోలీసులు, అధికారులు

పెద్దతిప్పసముద్రం : మండల పరిధి టి.సదుం పంచాయతీలోని చెన్నరాయునిపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. ఆ గ్రామంలోని దళితవాడకు చెందిన రామక్క(45) అనారోగ్యం కారణంగా సోమవారం రాత్రి మృతి చెందింది. దళిత కాలనీ వాసులు ఎవరైనా మృతి చెందితే.. ఇన్నాళ్లూ పాపాఘ్ని నది వద్ద ఖననం చేసేవారు. ఈ నేపథ్యంలో రామక్క మృతదేహాన్ని మంగళవారం పాపాఘ్ని నది వద్ద కాకుండా సంఘమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే తోపు పోరంబోకులో ఉన్న ఖాళీ స్థలంలో ఖననం చేసేందుకు దళితులు సమాయత్తం అయ్యారు. ఇక్కడ ఖననం చేయరాదని ఆలయానికి వచ్చి వెళ్లే భక్తుల వాహనాలు నిలుపుతుంటారని అగ్ర కులస్తులు దళితులకు సూచించారు. దీంతో కాలనీ వాసులకు, అగ్ర కులస్తుల మధ్య వివాదం నెలకొంది. సీఐ సాధిక్ అలీషా, తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్ఐ రవీంద్రబాబు, వీఆర్వో ఖాదర్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గీయులతో చర్చించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ 35 మంది దళితులకు గతంలో ఇదే తోపు పోరంబోకు స్థలానికి పట్టాలు ఇవ్వడంతోనే తాము శవాన్ని ఖననం చేస్తున్నామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ తోపు పోరంబోకు స్థలంలో ఉన్న చింతమాన్ల ఫలసాయం అనుభవించుకోవడానికి మాత్రమే పట్టాలిచ్చారని చెప్పడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. తమ సొంత స్థలాన్ని శ్మశానం వాటిక కోసం ఇస్తామని అగ్ర కులస్తులు చెప్పడంతో సదరు స్థలం అనుకూలంగా లేదని దళితులంతా నిరాకరించారు. సమస్య ఉద్రిక్తం కాకుండా సంప్రదాయాలను గౌరవించిన సీఐ.. శవాన్ని పొరంబోకు స్థలంలోనే ఖననం చేసేలా చొరవ చూపించారు. ఈ స్థలంలో మళ్లీ శవాలను పూడ్చే ప్రయత్నం చేయరాదని, ఆ లోపు అధికారికంగా శ్మశానానికి కేటాయించే శాశ్వత పట్టాను సిద్ధం చేసుకుంటే తాను సొంతంగా ప్రహరీ గోడ కట్టిస్తానని సీఐ దళితులకు హితబోధ చేయడంతో సమస్య తాత్కాలికంగా సద్దు మణిగింది.

దాల్ మిల్లుల్లో విజిలెన్స్ దాడులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని దాల్ మిల్లుల్లో కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. రెండు టీంలుగా ఏర్పడి దాల్ మిల్లులు, హోల్‌సేల్ మండి వ్యాపారుల స్థావరాలపై దాడులు చేశారు. శ్రీలక్ష్మీ స్వరూప దాల్‌మిల్లు, శ్రీ అమరావతి దాల్ ఇండస్ట్రీస్‌లతో పాటు మండి బజారులోని హోల్‌సేల్ దాల్ వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. మిల్లుల్లోని రికార్డులను పరిశీలించారు. నిల్వ ఉన్న స్టాకును రికార్డులతో సరి చూశారు. కృత్రిమంగా ధరలు పెంచాలనే ఉద్దేశంతో అవసరానికి మించి కంది బేడలు, మినప్పప్పు ఇతర ధాన్యాలను నిల్వ ఉంచారేమో అనే ఉద్దేశంతో ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో భాగంగా పలు రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కడప రీజినల్ విజిలెన్స్ అధికారి షేక్ మాసూంబాషా మాట్లాడుతూ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు పప్పు ధాన్యాలను అక్రమంగా నిల్వ చేసి కొరతను సృష్టించరాదని చెప్పారు. కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు ధాన్యాలను విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో సీఐలు పి.రామకృష్ణ, రెడ్డప్ప, అగ్రికల్చర్ అధికారి బాలగంగాధర్‌రెడ్డి, తారకనాథరెడ్డి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

23న నైమిశారణ్య పీఠాధిపతి రాక



శ్రీబాల బ్రహ్మనంద సరస్వతీ స్వామీ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గంగమ్మ దేవత ఆలయానికి ఈ నెల 23న నైమిశారణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతీ స్వామీ వస్తున్నట్లు ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, ప్రత్యేక అధికారి రవీందర్ రాజు తెలియజేశారు. మంగళవారం స్థానిక శ్రీ గంగమ్మ దేవత ఆలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతీ స్వామీ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నైమిశారణ్య పీఠాధిపతిగా భక్తులకు దర్శనమిస్తూ ఉంటారన్నారు. ఈ నెల 23న గంగమ్మ ఆలయంలో శ్రీదేవి భాగవత అంతర్గత గంగమ్మ దేవత తత్వంపై ప్రవచనాలను ఉపన్యసిస్తారన్నారు. ప్రవచనాలు చెప్పడానికి ఇక్కడికి ఆయన మొదటిసారి వస్తున్నట్లు చెప్పారు. కావున భక్తులు ఉదయం 9 గంటలకు ఆలయానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పూజారులు చంద్ర, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అధిక ధరకు అమ్మితే చర్యలు



తక్కువ ధరకే బియ్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ ఫర్మాన్ అహమ్మద్

రాయచోటి టౌన్ : బియ్యం అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని రైతు బజార్‌లో మార్కెట్ కమిటీ అధ్యక్షులు వందాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మార్కెట్‌లో బియ్యం ధర అధికంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. ఈ రైతు బజార్‌లో స్టీమ్ రకం కిలో రూ.46లకు, బీపీటీ రకం బియ్యం కిలో రూ.48కు విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ విక్రయ కేంద్రాల నిర్ణయానికి రాయచోటి పరిధిలోని రైస్ మిల్లుల యజమానులు, ట్రేడర్స్ సహకరించినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లుల యజమానులు సాదిక్ వలీ, బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, బియ్యం వ్యాపారులు, రాయచోటి మార్కెట్ యార్డు అధికారులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టను దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్లు



ఆలయ ప్రధాన ద్వారం వద్ద ట్రైనీ కలెక్టర్లకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ ఈవో

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల మూర్తులను మంగళవారం పది మంది ట్రైనీ కలెక్టర్లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ గావించారు. గర్భాలయంలోని మూల మూర్తులైన సీతారామలక్ష్మణ మూర్తులకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో కాసేపు సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి పేర్లు, వారు పని చేసే జిల్లాలు బను స్మరన్(అనకాపల్లి జిల్లా), సహదిత్ వెంకట్ త్రివిన్గ్(శ్రీకాకుళం జిల్లా), యశ్వంత్ కుమార్‌రెడ్డి(ఈస్ట్ గోదావరి జిల్లా), కె.ఆర్ కల్పశ్రీ(పల్నాడు జిల్లా), ఖుషల్ జైన్(అనంతపురం జిల్లా), మంత్రి మౌర్య భరద్వాజ్(వైఎస్సార్ జిల్లా), రాఘవేంద్ర మీన (విజయనగరం జిల్లా), సౌర్య మ్యాన్ పటేల్(ప్రకాశం జిల్లా), తిరుమని శ్రీపూజ(ఏలూరు జిల్లా), వి. సంజన సింహ(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా) ఇలా ఉన్నాయి. వీరి వెంట ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, మండల తహసీల్దార్ మధవి లత, రెవెన్యూ సిబ్బంది, టీటీడీ సిబ్బంది ఉన్నారు.

రైతు మిత్ర రాజశేఖర్‌రెడ్డి మృతి

మైదుకూరు : మైదుకూరు మండలం వనిపెంట కేంద్రంగా డీపీసీసీ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి రైతులకు సేవా సహకారాలను అందిస్తూ, రైతు మిత్రగా పేరు తెచ్చుకున్న ఎం.రాజశేఖర్‌రెడ్డి(62) మంగళవారం మృతి చెందారు. మైదుకూరు నుంచి బైక్‌పై ఈ నెల 7న ఆయన చాపాడుకు వెళుతూ విశ్వనాథపురం వద్ద కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రొద్దుటూరులో ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. పది రోజులుగా అక్కడ చికిత్స పొందినా కోలుకోలేదు. కోమాలోకి వెళ్లి పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు సోమవారం ప్రొద్దుటూరుకు తీసుకువచ్చారు. అక్కడే మంగళవారం మృతి చెందారు. చాపాడు మండలం చియ్యపాడుకు చెందిన రాజశేఖరరెడ్డి 1986 నుంచి మైదుకూరు మండలం, కడపలో వివిధ సేవా కార్యక్రమాలు, రైతుల కోసం వాటర్ షెడ్, వన సంరక్షణ, పంచాయతీ రాజ్, ఆరోగ్యం, పర్యావరణం, లీగల్ సర్వీస్, పర్యావరణ విద్యపై కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులు, గ్రామీణ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.

విద్యుత్ షాక్‌తో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని గుంతబజార్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, షాదీఖానా అధ్యక్షుడు బాబావల్లి(52) మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. వైఎస్సార్‌సీపీ కార్యకర్త బాబావల్లి వైఎస్సార్ ఫ్యామిలీ సమాధుల తోట సమీపంలో ఉన్న తన వెల్డింగ్ షాపులో విద్యుత్ లైన్ సవరిస్తుండగా.. విద్యుత్ సరఫరా అయ్యి షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు బాబావల్లిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు.. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■10th పాస్/ ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశము గల నర్సింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సులందు అడ్మిషన్లు జరుగుచున్నవి. హాస్టల్ వసతి కలదు. ✆ 9347762224. [T-1483]

SPOKEN ENGLISH

■FEE Rs. 10/- ; ONLINE 'or' OFFLINE OXFORD OF CAMBRIDGE STANDARDS (No Telugu) (No Home Work). Cont: PVR INSTITUTE, Proddatur. Cell: 9888266623. [C-777108]

శ్రీ శ్రీనివాస I.T.I ప్రొద్దుటూరు

■సం॥నకు ఎలక్ట్రీషియన్, Rs. 12,500/–లు, సివిల్ Rs.10,000/–లు, అన్ని ఫీజులు కలిపి. అడ్మిషన్ల కొరకు వెంటనే సంప్ర: 9490633112. [C-777109]

PARAMEDICAL

■B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1489]

వికాస్ అకాడమి

■2023 సైనిక్, నవోదయ సాధించిన సీట్లు, సైనిక్ స్కూల్: 22, నవోదయ: 17, అడ్మిషన్లు జరుగుచున్నవి. నర్సరి to 7th Class. Cont: శ్రీ విస్తాటి బసిరెడ్డి విలాస్, భరత్ నగర్, ఊటుకూరు, కడప. సెల్: 9390921596. [C-1216539]

SERVICE

శ్రీ మహాలక్ష్మి మ్యారేజ్ లింక్స్

■7/562-A-4, IInd Floor, NGO కాలని, కడప 1st, 2nd, Widow, Late Marriage, Widowes, All Castes, దేశ/ విదేశీ సంబంధాల కొరకు సంప్రదించగలరు: 7899499023. [C-1216597]

బంగారం కొనబడును

■మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 6192]

WANTED

■కొత్తగా ప్రారంభించిన మా కంపెనీ నందు 39 మంది స్త్రీ/పులకు ఉద్యోగాలు కలవు. జీ: 14000+DA6000 + ఫ్రీ రూమ్ + ఫుడ్, అర్హత:7th to డిగ్రీ, సంప్ర: ఔన్నూరు బస్టాండ్ దగ్గర, కడప. 9502400350. [A-7575]

■WANTED: టీచర్లు (All-Sub) 10-40000, PET, వార్డెన్స్, Comp.Ope, టెలి-Caller, HRs, Care-టేకర్స్, Tele-కాలర్స్, Recip, అకౌంటెట్స్, Tally-Ope, Drivers. 9550028506, 8919849743. [C-785908]

■ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లో జాబ్ చేయుటకు యువతీ యువకులకు అవకాశం కలదు. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 30. నో ఫీజు. సెల్: 9177342337. [WA-6999]

■ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9346276788. [M-1221456]

■వర్ధిత ఫైనాన్షియల్ (D.S.A నందు) పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (కార్ & కమర్షియల్‌లోన్స్) Q: ఇంటర్/డిగ్రీ+ 2సం॥ అనుభవం. జీ॥20వేలు / ఆపైన ✆ 93906 50048, 99591 80161- స్టోన్ హౌస్‌పేట – నెల్లూరు. [O-787287]

■కన్సల్టెన్సీ కాదు. VIPఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికిM/Fఆయా,నర్సులు,వంట చేయువారు ,RMP& డాక్టర్స్ కావలెను. జీ:12000-35000/-, ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7995365999 [HA-422]

■Needed Experienced Accountant (1), Billing Op (1), Drivers(2), Managers (2), Admin Staff (2), Supervisors (2) in Kotthas Foods Company, Kadapa. Ph: 9386412345, 9849541364 [WB-16395]

■ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీసు అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్లు: 10th – డిగ్రీ, జీ॥25,000/- ✆ 9642252949 [G-7436]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705944423
9705907418
9010223797
9010072409